"శ్లీలానికి నిర్వచనం ఏవిటి? దాని వెల ఎంత? చెప్పరా, రాంబద్రి" అంటూ విల్లు తీసి వాడి నోట్లో పెట్టబోయాడు గోపి.

"ఇంతమందిలో మీ స్నేహాన్ని భరించలేం." అంటూ లేవబోయాడు కృష్ణ

"కూర్చోరా జులపాల గాడిదా, మాంసం పకోడీలు తెప్పిస్తాను" అనే సరికి, ఆ ముఠా అంతా ఉత్సాహంతో చప్పట్లు కొట్టారు. ఆముదం తాగినట్టుగా ముఖం పెట్టేడు రాంబద్రి. ఎందుకంటే వాడో వెజిటేరియనయి పోయాడు వాడి బామ్మ వాడిని మడి, తడిల మధ్య పెంచింది.

# అహింస

కవిదిండి సీతాదేవి రామకృష్ణ



పకోడీల పొట్లం తెచ్చి టేబుల్ మీద పెట్టి వినయంగా నిలబడ్డాడు జోసఫ్. జోసఫ్ వినయవిధేయతలకు, స్నేహితుల కృత్రిమాభిమానాలకు కారణం గోపీ డబ్బు. గోపీ హోదా అతనికి తెలుసు. అందుకే కాలక్షేపానికి తప్ప వీళ్ళెవరినీ నమ్మడు. ముఠాలో కృష్ణని ముఖ్యంగా రాంబద్రిని కలపడం గోపి కిష్టంలేదు.

"ఏరా గోపి నీవెంత మడి కట్టుకున్నా ర్చున్నా మందుకని విందు పసందు లేదురా. చూడు నీవు చేసిన ఈ ఆర్భాటం బోసిగా వుంది" అంటూ గోపి పెరికాట్ జేబులో వత్తుగా వున్న వచ్చనోట్ల కేసి చూశాడు సుబ్బారావు.

ఉలిక్కిపడ్డాడు గోపి వాడి మాటలకు గోపి శ్రీమతి రమ గది తలుపులు తెరచుకుని అపర కాళిలా ఎక్కడ వచ్చేస్తుందో అని భయమేసింది గోపికి. మహిళల హక్కులంటూ ఈ ఆడవాళ్ళు పేట్రేగి పోతున్నారు. అయినా తప్పదు. ఈ రోజు

---

**అహింసకు అర్థాన్ని తెలుసుకునే ముందు హింస యెన్ని రకాలుగా వుంటుందో కూడా తెలుసుకో నవసరం లేదా?**

---

తన పుట్టిన రోజని సరిపెట్టుకుని గోపి మందు తెప్పించాడు. కొదిమందితప్ప తక్కిన వాళ్ళందరూ నిషాలో మునిగి పోయారు.

అగస్టన్ చెప్పిన స్త్రీ మాయా సుందరట! అదిగోరా మాయాసుందరి అంటూ అర్ధనగ్నంగా వున్న ఫారిన్ లేడీ ఛాయా చిత్రాన్ని వేలితో రాస్తున్నాడు చక్రపాణి.

పరిస్థితి తారాస్థాయి నందుకుంది. గోపికేం చెయ్యాలో పాలుపోలేదు. రాంబద్రి కేసి చూశాడు. గజేంద్ర మోక్షంలో ఏనుగులా నన్ను రక్షించమని వేడుకుంటూ. వాడు బ్రహ్మానందంగా "కాగడా"లో లీనమయిపోయాడు.

"గోపీ నీ వైఫ్ చాలా బావుంటుందిరా. నీవు చాలా అదృష్టవంతుడివి" అంటున్న సుబ్బారావు నోరుని కంగారుగా మూసి వేశాడు. ఎలాగో తంటాలుపడి అందరినీ బయటకు తోలేసరికి గోపీకి తల్రప్రాణం తోకకి వచ్చింది.

గట్టిగా గాలి పీల్చుకుని "హమ్మయ్య" అనుకుంటూ తలుపు గడియపెట్టాడు రమ

కోసం ఇల్లంతా గాలించాడు. బెడ్‌రూంలో వుంది కాబోలు. నెమ్మదిగా వెళ్ళాడు. గోడ మీద సుద్దతో రాస్తోంది అనాకార్సిన్ విర్వ చించిన వాక్యాలను "తాగుడువల" మూడు ఫలితాలున్నాయి. 1. సుఖంగా వుంటుంది. 2 తరువాత నిషా ఎక్కుతుంది. 3. చివరకు పశ్చాత్తాపం కలుగుతుంది. రమ ఆ వాక్యాలను ఆ గోడమీద ఎందుకు రాస్తోందో గోపీకి తెలుసు. ప్రక్కనే బాబు నిద్రపోతున్నాడు. ఎలా పలకరించాలో తెలియని అవస్థలో నెమ్మదిగా "రమా" అని పిలిచాడు.

"ఏం?" అంది సీరియస్‌గా చూస్తూ.

"కాసిని మంచినీళ్ళు తీసుకురా" అన్నాడు గోపి మంచినీళ్ళు యిచ్చిలైటు ఆర్పి వెళ్ళిపోయింది రమ

"అదేమిటి? వెళ్ళిపోతున్నావు. టైం ఎంతయిందో తెలుసా? నాకు నిద్ర రావోంది" అన్నాడు అమాయకంగా ఏం జరగనట్లు

"నిద్దరొస్తే పడుకోండి. నేను దేనికి" అంది రమ నిరక్ష్యంగా.

రమ ఒళ్ళు వుడికిపోతోంది. స్నేహితులతో ఖుషీగా కబుర్లు. పార్టీలు అనవసర మైన మాటలు. రాత్రి ఇంటికి వచ్చే సరికి పెళ్ళాం. కోవంతో ఆమె రక్తం వేడెక్కింది. ఆ కోవంవల్ల ఆమెకేం ప్రయోజనం లేదు.

పదిహేను నిమిషాల కోవంలో వృధా అయ్యే శక్తితో తొమ్మిది గంటలు పని చెయ్యవచ్చట. న్యూయార్కులో డాక్టర్ ఈస్టర్ ఒక కోపిష్టి రక్తాన్ని ఒక కుందేలుకి ఎక్కిస్తే దానికి పిచ్చెక్కి చచ్చిపోయిందట.

సంఘంలో స్త్రీ గౌరవం. సమాన హక్కులు. ఆర్థిక స్వాతంత్ర్యం-హుష్. కేవలం ఉపన్యాసాలు. పుస్తకాలు. రేడియో ప్రచారాలవరకే పరిమితం.

ఆడదానిగా పుట్టడం మహా ఘోరం. నరకం అనుకుంది రమ.

నేనే మొగాడినైతే అనుకుంది కళ్ళు మూసుకుని.

"ఏంటి రమా? ఆలోచిస్తున్నావు. మగాడన్న తరువాత ఏవో సరదాలుంటాయి. చెప్పానుగా కొన్ని కొన్ని పనులు కంపెనీ కోసం బలవంతంగా చెయ్యవలసుంటుందని. కంపెనీకోసం ప్రతాగి రమా. అంత మాత్రాన నేను తాగుడికి అలవాటుపడతానని అనుకోకు. ఒక చెడ్డ అలవాటుకి దిగజారిపోయేటంత నరాల బలహీనత నాకు లేదు ఏమిటో నీవు ప్రతీదీ భూతద్దంలో చూసావు నీకు అన్నీ భూతాలలాగే కనిపిస్తాయి. మగాడన్న తరువాత ఏవో చిన్న చిన్న సరదాలుంటా" అంటూ అవులిస్తూ వళ్ళు విరుచుకుంటున్న గోపీని





# సీతాంజన్®

(పై పూతకు మాత్రమే)

రొంప, జలుబు, తలనొప్పి, దగ్గు, నడుమునొప్పి కీళ్ళనొప్పులు, కండరమునొప్పి, బెణుకునొప్పి తగ్గించును

అన్నిషాపులయందు లభించును

తయారు:- శ్రీరామ ఆయుర్వేదనిలయం (Regd)

కత్తిపూడి (వయా) చెబ్రోలు తూ॥గో॥ జిల్లా (ఆం.ప్ర)

శ్రీకాకుళం. విజయనగరం. వైజాగ్. తూర్పు. పశ్చిమ గోదావరి జిల్లాలకు మినహా మిగతా జిల్లాలలో స్టాకిస్టులు కోరబడుచున్నారు.

# ఋణం

వ్యాపారాభివృద్ధి కోనం ఆకర్షణీయమైన షరతులమీద భవనం. వ్యాపారం. షాపులు. భూములు. థియేటర్లు. లిమిటెడ్ కంపెనీలు. పరిశ్రమలు వగైరాలకై రు. 20.000 లేక ఆపైన ఋణం లభించును.

వ్రాయండి లేదా సంప్రదించండి. ఫోన్ : 395121

**SUPREME CORPORATION (BANKERS)**

F-15 "EVEREST" 7th Floor, Near Famous cine laboratory,

Tardeo Road, BOMBAY-400 034.

ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో

## క్లాసులు ప్రారంభమయినవి

**1981 ఫిబ్రవరి 21, 22 తేదీలలో 6వ తరగతి లోనికి ప్రవేశ పరీక్షలు జరుగును. సైనిక స్కూలు, కోరుకొండ (ఏ.పి)**

* బాలుర వయస్సు 1981 జూలై 1వ తేదీ నాటికి 10, 12 సం॥ల మధ్యనుండవలెను. డిఫెన్సులోని, ఎక్సుసర్వీసు ఉద్యోగుల పిల్లలకు మరియు షెడ్యూలు కులములవారికి ప్రత్యేక రిజర్వేషన్లు కలవు.

కోరుకొండ సైనికస్కూలుతో సమానముగా ప్రారంభించి, చక్కటి హాస్టలు వసతితో పై పరీక్షలకు ఇంగ్లీషు. తెలుగు మీడియంలో శిక్షణ నిచ్చుటలో పేరెన్నికగన్న దక్షిణ భారత దేశమునందలి ప్రప్రథమ విద్యాసంస్థ.

ఫోన్ : 22084




# శ్రీ విద్యా విహార్

"ఆదర్శ గురుకుల విద్యాసంస్థ"

లలితానంద నగర్, రింగ్ రోడ్, గుంటూరు-6.

నర్సరీ నుండి మెట్రిక్ వరకు ఇంగ్లీషు, తెలుగు మీడియంలో క్లాసులు కలవు.

SAVITA




చూస్తే రమకి నవ్వాలో, ఏడవాలో అర్థం కాలేదు.

"చూడండి గోపీ! శీలానికి విలువ యేమిటి? ఇందాకా మీరు పార్టీలో యెవరినో అడుగుతున్నారుకదూ! చెప్పండి" అంది రమ.

నాకూ తెలియకే ఆ ప్రశ్న వేశాను అనుకున్నాడు గోపీ. పైకి-

"అదేమిటి? ఒక్కొక్కళ్ళు యింతని చెప్పలేరు. అఫ్‌కోర్సు చూడు మన రంగడి పెళ్ళాన్ని శీలం వెల యెంత అని అడిగితే రూపాయని రెండు రూపాయ లంటుంది. అది వాళ్ళు యిచ్చే విలువ. అది వ్యక్తిగత అభిప్రాయాలనుబట్టి వుంటుంది".

రమ ఏమీ మాట్లాడలేదు. తిరుగుతున్న ఫేన్ కేసి చూస్తోంది. ప్రక్కనున్న తీగ మీద ఒంటరిగా పడుకున్న పిచ్చుక కేసి చూస్తోంది.

రమకి ఆ పిచ్చుకంటే మహా జాలి. రోజూ మగపిచ్చుక, ఆడపిచ్చుక రెండూ రమ గదిలో ఆ తీగ మీద పడుకునేవి. గోపీకి రాత్రి భోజనమయిన తరువాత మిత్రులతో కాసేపు కాలక్షేపం చెయ్యడం అలవాటు. ఈ లోపుగా రమ పని ముగించుకుని మంచం మీద ఆలోచిస్తూ పడుకునేది. ఆ పిచ్చుకల జంట అదే స్థానంలో అదే తీగపై ఒకే మాదిరిగా జంటగా వుండడం రమకు ముచ్చటనిపించేది. రాత్రి సమయాన ఎపుడైనా గోపీ రావడం ఆలస్యమయితే ఆ ఆడ పిచ్చుకను చూస్తూ మనసులో అనుకునేది రమ-

నీ నాథుడికి నువ్వంటే ఇష్టం నిన్ను విడిచి వుండలేడు— కాని నా నాథుడలా కాదు. ఎవరయినా మిత్రులు దొరికితే పెళ్ళయిందన్న సంగతే మరచిపోతాడు. అంతేకాదు మగాడినన్న దర్పం ప్రదర్శిస్తూ వుంటాడు.

అదేమిటో అంతకు ముందురోజు మగ పిచ్చుక రాలేదు. కాసేపు గజిబిజిగా గది అంతా తిరిగి ఆడపిచ్చుక అదే స్థానంలో నిద్రపోయింది. ఆ రోజు రాత్రి గోపి కూడా రాలేదు. ఏదో పార్టీ వుందన్నాడు. నిజా నిజాలు భగవంతుని కెరుక.

ఆ మరునాడు రాత్రి ఆడపిచ్చుక ఒంటరిగా పడుకుంది. అంతవరకు ఎక్కడో పెత్తనాలు చేసిన మగపిచ్చుక ఎంతో హుషారుగా లోపలికి వచ్చింది. ఆ భాషేమిటో తెలియదు. ఆసక్తిగా చూస్తోంది వెల్లకిలా పడుకుని రమ.

ఆడ పిచ్చుక కిచకిచమని అరుస్తూ దాన్ని దగ్గరకు చేరనివ్వలేదు. రమకు ఆశ్చర్యం వేసింది. తనలో క్యూరియాసిటీ బయలుదేరింది. మగపిచ్చుక ఏం చేస్తుందా అని చూస్తోంది. రెండుసార్లు దానిప్రక్క చేరడానికి ప్రయత్నించింది. ఎక్కడా చేరనివ్వకపోవడంతో నిరాశగా క్రింద తీగమీద వాలింది.

బహుశ మగపిచ్చుక ఏదో తప్పుచేసి వుంటుంది అది పసిగట్టిన ఆడపిచ్చుక దాన్ని దగ్గరకు చేరనివ్వడంలేదు కాబోలు. ఆ ఆడ పిచ్చుక పవిత్రతకు అబ్బురపడింది రమ. తలుపు చప్పుడైంది. వెళ్ళి తలుపుతీసింది. సన్నజాజుల దండ మీద గిరాటు పెట్టాడు.

ఆవులిస్తూ పాల నురుగులా వున్న బెడ్ షీట్‌పై వెల్లకిలా పడుకున్నాడు గోపి. ఫుల్ హేండ్స్ టెరికాట్ వైట్‌షర్టు సగం దాకా మడిచాడు. మోచేతుల దగ్గర నలిగి వున్న అతని షర్టు, బలంగా పైకుబికిన కండరాలు మత్తెక్కించే మగసిరి చిహ్నాల్లా వున్నాయి.

"అబ్బ! లైట్ ఆఫ్ చెయ్యి రమా!" అన్నాడు రమ వైపుకు జరుగుతూ.

"అలాగే వుందు అటు చూడండి ఆ తీగపైన ఏముందో" అంది రమ.

"పిచ్చుక పిల్ల"

"క్రింది తీగపైన?"

"ఇంకొకటి."

"రెండిటిని పరిశీలించండి" అంది రమ.

"అబ్బబ్బ! ఏంటి రమా? చంపేస్తావ్."

"ఏమిటి పరిశీలించడం? మగ, ఆడ పిచ్చుకలు మనకిమల్లే మొగుడు పెళ్ళాలు. హాయిగా నిద్రపోతున్నాయి."

"మరయితే మనలాగే అవి జంటగా పడుకోలేదేం?" అంది రమ.

"ఏదో పోట్లాడుకున్నాయి కాబోలు. నీకులాగే ఆ ఆడపిచ్చుక చాలా పెంకెది కాబోలు" అంటూ బలంగా దగ్గరకు తీసుకుంటున్న గోపిని ఒకసారి విదిలించింది రమ.

ఆ పిచ్చుకల అలవాట్లను. అన్యోన్యతను, ప్రవర్తనను, ఒక రోజులో జరిగిన మార్పుని రమఅంతా విపులంగా చెప్పింది.

"హోష్! అదా నీ భ్రాంతి. అంతకన్నా ఏంలేదు. అలా నీకిష్టమైన విధానంలో నీవూహించుకున్నావు. అసలు తప్పంతా ఆ ఆడ పిచ్చుకదేనంటాను. ఒక రాత్రి బయట కాలక్షేపం చేసిన మగ పిచ్చుకను వెలివెయ్యటం రాక్షసత్వం. అసలు ఆ ఆడపిచ్చుకను ముక్కు ముక్కలకింద నరికెయ్యాలి. మగాడన్నతరువాత ఎన్నో వ్యవహారాలుంటాయి. అంతమాత్రాన దాన్ని వెలివేస్తుందా? రాస్కెల్!.... ఆ ఆడ పిచ్చుకను ఈ గదినుంచి తరిమెయ్యాలి" అంటూ డ్రాయరుమీదున్న పళ్ళ చాకుని ఆడపిచ్చుకమీద గిరాటేస్తున్న గోపీ చేతిని పట్టుకుని ఆపుచెయ్యబోయింది రమ. అంతా క్షణంలో జరిగిపోయింది. ఫలితంశూన్యం.

కన్నుమూసి తెరిచేంతలో భయంకర దృశ్యాన్ని చూడవలసి వచ్చింది. ఆర్తనాదం చేస్తూ పిచ్చుకపిల్ల డ్రాయరుమీద పడింది... రక్తపుచుక్కలు. అప్రయత్నంగా ఆమెకళ్ళు జలపూరితాలయ్యాయి.

"ఎంతపని చేశావ్ గోపీ! .... ఆ నోరులేని ప్రాణి నిన్నేం చేసింది. ఆ వుసురు మనకి తగలకపోదు. పక్షిపిల్ల శాపం వూరికేపోదు. ఆమె కంఠందగ్గర ఏదో సుడులు తిరుగుతున్న బాధ.

"యు ఆర్ టూ సెన్సిటివ్ రమా దట్ ఈజ్ నాట్ గుడ్ ఫర్ యు" అంటూ లేచిపోయాడు గోపి.

అప్పటికప్పుడే లేచివెళ్ళి దేవుని దగ్గర దీపం వెలిగించి అనవసరంగా ఒక ప్రాణిని హింసించిన పాపాన్ని క్షమించమని చేతులు జోడించి కళ్ళు మూసుకుని ప్రార్థించింది. కళ్ళు తెరిచిపైకి లేచేసరికి పెద్ద అక్షరాలతో పూజా మందిరంలో తెల్లటి గోడపై "ప్రార్థనవలన నీవు పాపాలకు దూరం అవుతావు కానీ పాపాలుచేస్తూ, ఆ పాపాలు కడిగివేసుకోవడానికి ప్రార్థన చేస్తే ఆ ప్రార్థన భగవంతుడు వినడు" ఎక్కడో చదివిన వాక్యాలు కంటబడ్డాయి.

ఆ వాక్యాలు ఆమెను వెక్కిరిస్తున్నాయి. హేళన చేస్తున్నట్లనిపిస్తున్నాయి.

ఆయన చేసినపని, ఆ పిచ్చుక మరణం కేవలం తన మూలానే జరిగిందేమో అనుకుంది రమ. ఏవేవో ఊహించుకుంది. తత్ఫలితంగా ఆమె మనసులో అశాంతి, ఒక విధమైన స్తబ్ధత చోటు చేసుకున్నాయి.

నాల్గు రోజులు కాలేజీకి లీవు పెట్టింది. ఐదవ రోజున వెళ్ళక తప్పింది కాదు. కాలేజీకి వెళ్ళడానికి సిద్ధమవుతూ గోపీ దగ్గరకు వెళ్ళింది తాళాలు యిద్దామని. గదిలో కిషన్ బుల్లి బుల్లి చేతులతో తండ్రి స్టెతస్కోపును మెడలో పెట్టుకుని ప్లాస్టిక్ బొమ్మ గుండె యెలా కొట్టుకుంటోందో చూస్తున్నాడు. వాడి తెలివితేటలకు ఆశ్చర్యపోయింది. ఎంత ఆపుకుందామన్నా నవ్వాగలేదు.

ఈ మధ్యకాలంలో నిండుగా నవ్వింది అప్పుడే.

గోపి లోపలికి వస్తూ "కిషన్! ఎన్నాళ్ళకు వెన్నెలొచ్చిందిరా! మీ అమ్మకి యెలా నవ్వు తెప్పించాలో నాకంటె నీకే బాగా తెలుసు" అంటూ వాడిని భుజాల మీద కూర్చోబెట్టుకున్నాడు.

"తాళాలివిగో నాకు టైమయింది" అంటూ వెనుదిరిగి కాలేజీ వెళ్ళింది. లాస్ట్ అవర్ చాలా సీరియస్‌గా పాఠం చెబుతోంది. ఎప్పుడూ ఆమె నవ్వుతూ పదిమందిని నవ్విస్తూండటం అలవాటు.

"మేడమ్! మీరు లెసన్ చెబుతూంటే మాకు పిక్చర్ చూస్తున్నంత హాయిగా వుంటుంది" అంటారు స్టూడెంట్సు.

ఆముదాలు వేసిన మంగలంలా వుంది రమ ముఖం ఆ రోజు. విద్యార్థుల ముఖాలు ఆశ్చర్యంతో క్వశ్చన్ మార్కులయ్యాయి. ఆ రోజు క్లాసు ఏదోలా ముగించి బయటికొచ్చింది రమ.

"మేడమ్! మొన్న మీటింగ్‌లో గాంధీజీ అహింసా సిద్ధాంతాన్ని చాలా చక్కగా చెప్పారు. మీరు చెప్పే సమయాన మేం మా దేహాలు విడిచి బుద్ధులమయ్యామంటే నమ్మండి. అవే పాయింట్సు మళ్ళీ ఒకసారి చెప్పగలరా! కొన్ని కొన్ని నోట్ చేసుకోవాలి" అంటున్న అనూరాధను చూస్తూ 'అలాగే రేపు' అంటూ బయటకు వచ్చేసింది.

పుస్తకాల షాపుకెళ్ళి బాబుకి బొమ్మల పుస్తకాలు, స్వీట్సు కొని ఇంటిదారి పట్టింది రమ. శీతాకాలపు పొద్దు కావటాన చీకటి రేఖలు తొందరగా అలుముకుంటున్నాయి. తొందరగా నడక వేగాన్ని హెచ్చించింది.

"అహింసా సిద్ధాంతాన్ని గురించి విపులంగా చెప్పగలరా?" అన్న అనూరాధ మాటలు—గోపీ—పిచ్చుకపిల్ల మరణం హింసాత్మక చర్య — కళ్ళముందు కదలాయి.

అహింసఅంటే సజీవమైన వానిని, వేటినీ హింసించకూడదని సాధారణంగా అర్థం వచ్చేస్తుంది. కానీ అహింసా పదానికి ఆ అర్థం సరిపోదంటాడు మహాత్మ ప్రతీ చెడుతలుపు. అనృతం, ద్వేషం, పరులు చెడిపోవాలనే కోరిక, ఇవన్ని అహింసా సూత్రానికి పూర్తి విరుద్ధాలట.

అహింసా సిద్ధాంతాన్ని ఇంతగా విపులీకరించిన అపరబుద్ధావతారంగా, వెలసిన పూజ్య బాపూజీని, ఘోర హింసాత్మక చర్యతో గాడ్సే బలిగొన్నాడంటే అది నుదిటి రాతా లేక విధి లిఖితమా?

అయ్యో! చీకటిపడిపోయింది అనుకుంటూ నడక వేగాన్ని హెచ్చించింది రమ

రెండు బలమైన చేతులు పిడుగుల్లా ఆమె భుజాల మీద పడ్డాయి.

ఉలిక్కిపడి కెవ్వున అరుస్తూ వెనక్కి చూసింది రమ.

భయంకరాకారం. గుబురు మీసాలు, సారావాసన, పిల్లికళ్ళమాదిరిగా మెరుస్తున్న కళ్ళు, పదునైన చాకు.

"లొంగిపో- మాటాడకు- అరిచావంటే చంపేస్తాను. ఇదిగో చేతిలోది చూస్తున్నావా?

రోజూ నిన్ను చూస్తున్నాను. ఈరోజు చిక్కావు. నా కోరిక కాదనకు. ఎవ్వరికీ తెలియదులే. ఏంతప్పులేదు. మళ్ళీఎప్పుడూ నీజోలికి రాను."

ఎముకలు విరిగిపోయేటంత గట్టిగా నొక్కేస్తున్నాడు ఆమె భుజాలను. చేతిలో పుస్తకాలు క్రిందకు జారాయి. ముందు ఏం జరగబోతోందో ఊహించుకుంది రమ.

ప్రాణాలన్నా పోగొట్టుకుంటుందిగాని ఆ ఊహను భరించలేదు. పరిస్థితి విషమించిపోతోంది.

ఈ విపత్కర పరిస్థితిలో రాక్షసుడిగా మారిన మగాడిని ఆడది ప్రతిఘటించలేదేమో?

మగజాతి మీద మగాడిగా పుట్టి కక్ష సాధిద్దామని వుంది ఆమెకు.

దేవా! తిరిగి జన్మంటూ ప్రసాదిస్తే మగజన్మ ప్రసాదించు. లేదా జన్మ రాహిత్యాన్ని అనుగ్రహించు- అనుకుంది మనస్సులో.

పరిసితి విషమించిపోతోంది— ఇక ఆలస్యం చేయకూడదని ఆ ఆకారం చేతిలోని చాకు తీసుకుని పీకలో బలంగా పొడుచుకుంది.

ఊహించని పరిణామానికి ఆ ఆకారం హడలిపోయింది, తత్ఫలితంగా ఇనుప స్తంభాల్లాంటి హస్తాలు ఆమెను విడిచిపెట్టాయి. ఆఖరిక్షణాన్లో కిషన్ మనస్సులో మెదిలి వుంటాడామెకు.

శ్రీకవితా వారి నూతన ప్రచురణలు
ఆంధ్రుల అభిమాన రచయిత్రులు
డా. కె. వి. కృష్ణకుమారి, శ్రీమతి విమలారామం అపూర్వరచనలు
మంచుపూలు - డా. కె. వి. కృష్ణకుమారి .....12-50
(ఒకేసారి మూడుభాషల్లో వెలువడుతూ పాఠకులనుర్రూత లూగిస్తున్న ఏకైక నవల)
కలకాలం నిలిచేది - శ్రీమతి విమలారామం..10-50
(కుహనసంస్కారానికి వాస్తవమైన సంస్కారానికి జరుగుతున్న అంతః సంఘర్షణలో ఈనవల శ్రీమతి విమలారామం అపూర్వసృష్టి)
డాక్టర్ తులసీకృష్ణ - సింహప్రసాద్..........9-00
(జనసుధ పత్రికలో సీరియల్ అయిన మేటి నవల)
మీకు కావలిసిన పుస్తకాల ధర M.O. పంపండి పోస్టేజి ఉచితం
శ్రీకవితా పబ్లికేషన్స్. మ్యూజియంరోడ్డు, విజయవాడ-2